క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక



వెంకటాపురం(కె): మండల కేంద్రంలో జాతీయ మానవ హక్కుల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మైస దైవ క్రిష్టియన్ దాస్, ప్రధాన కార్యదర్శిగా రాయుడు జయరాజు, కమిటీ సభ్యులుగా ముర్ర రాజేష్, మడకం సునీత, ఉమ్మడి పద్మ, రామకృష్ణలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గోగుల మూడి హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు తాగునీటి సౌకర్యం కల్పించి ఫ్రీడ్జి ఏర్పాటు చేసి చల్లటి నీటిని పంపిణీ చేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమ రెడ్డి తెలిపారు. వేసవికాలం నేపథ్యంలో ప్రయాణికులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు ప్రతీ రోజు మధ్యాహ్నం చల్లటి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఎండీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వారి ఆదేశాల మేరకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో కాళేశ్వరం, మహదేవపూర్ బస్టాండ్‌లో కూడా ఫ్రీడ్జిలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

తీన్మార్ మల్లన్న టీం సభ్యుల ర్యాలీ



మల్హర్: తీన్మార్ మల్లన్న అక్రమ అరెస్ట్ నిరసనగా మండలంలోని తాడిచర్లలో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు ఎడ్లబండ్లతో బుధవారం ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, మండల అధ్యక్షుడు ఆర్ని రాజబాబు, ఉపాధ్యక్షుడు మోహన్‌లు మాట్లాడుతూ.. మల్లన్న అక్రమ అరెస్ట్‌కు నిరసనగా 20 ఎడ్ల బండ్లతో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాడని అరెస్ట్ చేయడం మంచిది కాదని తీన్మార్ మల్లన్న వెంట రైతులు, ప్రజలు, 7200 తీన్మార్ మల్లన్న టీంకు అండగా నిలుస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మోహన్, మండల, జిల్లా కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

మహాముత్తారం: మండలంలోని మహాముత్తారం, ములుగుపల్ల ఫీడర్ చానల్లో త్రీఫేస్ కరెంట్ అంతరాయం ఏర్పడుతుందని దీంతో వ్యవసాయ అవసరాలకోసం ఇబ్బంది పడుతున్నామని రైతులు మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేసి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సరఫరా సరిగ లేకపోడంతో పొలాలు ఎండిపోయె పరిస్థితినెలకొందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి త్రీఫేస్ కరంటు కటింగ్ లేకుండా సరఫరా చేసి ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతులు మార్క బాపు, శ్రీపతి సత్యం, బుర్రి నర్సయ్య, గద్దం రాజమల్లు, చిటూరి అశోక్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహదేవపూర్: అప్పులు బాధతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సూరంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన నాగుల మహేష్(28) వరికోత మిషన్ కొనుగోలు చేశాడు. అది సక్రమంగా నడవక పోవడంతో నష్టానికి విక్రయించి అప్పులు చేశాడు. దీంతో చేసిన అప్పులు తీర్చాలని తీవ్ర మనస్థాపం చెంది ఈనెల 2న రాత్రి పురుగుల మందు తాగి అదే గ్రామానికి చెందిన ములకల మధుకర్ దగ్గరికి వెళ్లి పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. మధుకర్ వెంటనే మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మహేష్ మృతిచెందాడు. మృతుడి తల్లి నాగుల పోసక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



వాజేడు: జగ్జీవన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ మేనక



ఏటూరునాగారం: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..



కన్నాయిగూడెం: బుట్టాయిగూడెంలో..



ములుగు రూరల్: కాశిందేవిపేటలో..

జగ్జీవన్ రామ్ ఆశయాలతో ముందుకు..

ములుగు: జగ్జీవన్ రామ్ ఆశయాలతో ముందుకు సాగాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. జిల్లాకేంద్రంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ములుగు రూరల్: భారత ఉప ప్రధాని, సామాజిక సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను మండలంలోని కాశిందేవిపేటలో సర్పంచ్ అహ్మద్‌పాషా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. భారత పార్లమెంట్‌లో 40 ఏళ్ల పాటు వివిధ హోదాలలో కొనసాగారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో దేవరనేని సుధాకర్‌రావు, గుండాల రఘు, కిరణ్, రమేష్, అశోక్ , మహిళలు పాల్గొన్నారు.

ములుగు రూరల్(గోవిందరావుపేట): బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో గోవిందరావుపేట మండలం పస్రాలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. మడిపెల్లి శ్యాంబాబు అధ్యక్షతన నిర్వహించగా ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఇరుగు పైడి మాదిగ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంటరానితన నిర్మూలనకు అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ శ్రీను, దుర్గారావు, సమ్మయ్య, రాంబాబు, యాకుబ్, సాంబయ్య, సుధాకర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఈసం రామ్మూర్తి ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుక జగ్జీవన్ రామ్

అణగారిన వర్గాల గొంతుక జగ్జీవన్‌రామ్ అని ప్రజా సంఘాల నాయకులు పొదెం కృష్ణప్రసాద్, స్వామి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమురం ప్రభాకర్, సాంబశివరావు, కోటయ్య, ప్రకాష్, వెంకటేశ్వర్లు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో..

మండల కేంద్రంలోని గిరిజన బాలుర క్రీడా పాఠశాలలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూల మాల వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సునిత, ఉపాధ్యాయులు సరిత, హుస్సిలాల్, సంపత్, రవీందర్ పాల్గొన్నారు.

వాజేడు: మండలంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా పెద్ద గొళ్లగూడెం గ్రామ పంచాయతీలో సర్పంచ్ జజ్జరి మేనక ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కన్నాయిగూడెం: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని బుధవారం నిర్వహించారు. అలాగే బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీలో సర్పంచ్ కావిరి పద్మ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మి, రాము, లావణ్య, సత్యం, సాయిబాబా, రమేష్, కావిరి చిన్నికృష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ములుగు: జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



ఏటూరునాగారంలో..



పస్రాలో..



ఏటూరునాగారం: క్రీడా పాఠశాలలో..



వాజేడులో..

పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్: ములుగు మండలంలోని పాల్‌సాబ్ పల్లికి చెందిన పోలు వినయ్, మాదారపు ఐలయ్య, బండారుపల్లికి చెందిన ఈర్ల తిరుమల ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సీతక్క బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్, యూత్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, ఆకుతోట చంద్రమౌళి, రేవంత్‌యాదవ్, మావు రపు తిరుపతిరెడ్డి, సర్పంచ్ అహ్మద్‌పాషా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, రాజయ్య తదితరులు ఉన్నారు.

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పరామర్శ..



పరామర్శిస్తున్న నాగజ్యోతి

మండలంలోని జాకారం గ్రామానికి చెందిన గండ్రత్ మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి బుధవారం పరామర్శించారు. మల్లయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భాదం ప్రవీణ్, సర్పంచ్ దాసరి రమేష్, కోగిల మహేష్, సురేందర్, రాజహుస్సేన్ ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వాజేడు: మొదటి అంతరాష్ట్ర కౌశల్ మహోత్సవానికి నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తులను చేసుకోవాలని వాజేడు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాస్‌పోర్టు కలిగి ఉండి ఉద్యోగాల కోసం వేసి చూస్తున్న వారికి మంచి అవకాశం ఉందన్నారు. డిగ్రీ, ఐటీఐ, పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత అయిన వారు ఈ నెల 9 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



మంగపేట: అరెస్టు అయిన నాయకులు



ఏటూరునాగారంలో..

మంగపేట: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఎలాంటి సంఘటనలు చేపట్టకుండా ముందస్తు జాగ్రతలో భాగంగా పోలీసులు మండల, జిల్లా స్థాయి నాయకులను బుధవారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తాటి కృష్ణ మాట్లాడుతూ.. బండి సంజయ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్ష పేపర్లు లీకవుతున్న తరుణంలో సమాధానం చెప్పలేక ప్రభుత్వ వైఫల్యం, అసమర్థత ప్రజలకు అర్థం కాకుండా ఉండేందుకు బండి సంజయ్‌ను అకారణంగా అరెస్టు చేశారన్నారు. అరెస్టులకు తాము బయపడేది లేదన్నారు. మరింత ఉధృతంగా నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామన్నారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు లొడె శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అల్లె జనార్ధన్, నాయకులు దంతెనపెల్లి నరేందర్, మీరాపాష, రఘు, సాంబయ్య, రవి, కృష్ణ తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అరెస్టును వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న బీజేపీ మండల నాయకులు బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మండల అధ్యక్షుడు గండెపల్లి సత్యం, నాయకులు చక్రవర్తి, జనార్దన్, నవీన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వాజేడు: గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. మండల పరిధిలోని కొంగాల గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామస్తులు కలిసి కట్టుగా పనులను చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. కొత్త వారికి ఆశ్రయం ఇవ్వవద్దన్నారు. ఏ సమస్య ఉన్నా పోలీసులకు నేరుగా వచ్చి చెప్పుకోవచ్చని తెలిపారు. మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

భూపాలపల్లి అర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్ మాట్లాడుతూ.. జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సంజయ్ పదో తరగతి ప్రశ్నపత్రాన్ని లీక్ చేసే స్కామ్‌లో ఉండటం సిగ్గుమాలిన చర్యన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మహదేవపూర్: పదో తరగతి హిందీ పేపర్ లీకేజీ విషయంలో ప్రధాన సూత్రధారి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో బీజేపీ నాయకులు చలగాటం ఆడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతి బాపు, కాటారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పెండ్యాల మమత మనోహర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు లింగాల రామయ్య, మండల ప్రధాన కార్యదర్శి కిరణ్, యూత్ మండల అధ్యక్షుడు అలీమ్ ఖాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మహేష్, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ పద్మ ఉన్నారు.



భూపాలపల్లి అర్బన్: బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న సీఐ శివప్రసాద్



ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేస్తున్న పోలీసులు

వాజేడు: మండలంలోని 163 నంబర్ జాతీయ రహదారిపై వెంకటాపురం(కె) సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. మండల పరిధిలోని చీకుపల్లి వద్ద వాజేడు ఎస్సై రేఖ అశోక్ సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి సీఐ శివప్రసాద్ వాహన తనిఖీలు చేపట్టారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని ఆపి క్షణ్ణంగా పరిశీలించారు. ప్రయాణికులను ప్రశ్నించడంతో పాటు వారి వివరాలను తెలుసుకున్నారు. ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేశారు. మావోయిస్టు యాక్షన్ టీమ్‌లు సంచరిస్తున్నాయనే కోణంలో తనిఖీలు కొనసాగినట్లు తెలుస్తుంది.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

చిట్యాల: మండలంలోని మానేరు వాగు నుంచి ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జడల్‌పేట క్రాస్ వద్ద పోలీసులు తనీఖీ చేస్తుండగా ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా నైన్‌పాక మీదుగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గిద్దెముత్తారం గ్రామానికి చెందిన టాక్టర్ డ్రైవర్, ఓనర్ కోమ్ముల నర్సింగంపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది ఏఎస్సై మధుసూదన్, అశోక్, అస్లాం జానీ, లింగన్న, సిద్ధు పాల్గొన్నారు.

నియామకం



దేవదాసు, ఉపాధ్యక్షుడు

కాటారం: ఎస్సీ ఎస్టీ జర్నలిస్టుల యూనియన్ జిల్లా కమిటీలో కాటారం మండలం నుంచి పలువురు జర్నలిస్టులకు చోటు కల్పించారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంథని సమ్మయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా గంట దేవదాస్, ముఖ్య సలహాదారుడిగా మెండ మల్లేశ్, సహాయ కార్యదర్శిగా మంత్రి రాజబాబును నియమించారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంథని సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు బండ మోహన్, కార్యదర్శి అంబాల సంపత్‌తో పాటు నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వీరి నియామకంపై మండల పాత్రికేయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు భరోసా



మంగపేట: జ్యోతికి నగదు అందజేస్తున్న నరేష్



ఏటూరునాగారం: బియ్యం ఇస్తున్న నిర్వాహకులు

మంగపేట: మండలంలోని మల్లూరుకు చెందిన బరుపటి జ్యోతికి అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో బాధితురాలికి వైద్య ఖర్చులకు ఏటూరు నాగారం బ్లడ్ డోనర్స్, మంగపేట జ్వాలా యూత్ ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన రూ.29,000 నగదును బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్వాలా యూత్ అధ్యక్షుడు కోడెల నరేష్, బాబా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

ఏటూరునాగారం/మంగపేట: మంగపేట మండలం రమణక్కపేటకు చెందిన వెల్పుల భారతి భర్త వదిలేసి మరో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు పిల్లలతో ఒంటరిగా జీవిస్తుంది. భారతి ఉంటున్న ఇల్లుకు ఉన్న మట్టిగోడ కూలి భారతి కాలుపై పడి విరిగిపోయింది. దీంతో ఎలాంటి జీవనాధారం లేని ఆ కుటుంబానికి ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్, మంగపేట జ్వాలా యూత్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు వహిద్‌పాషా, ఖాజాపాషా, కూనూరు మహేష్, చింత సతీష్, గాయస్, బండారి లక్కి, ప్రశాంత్, కయ్యూమ్, ముస్తాఫా పాల్గొన్నారు.

కౌలు రైతులను పట్టించుకోని అధికారులు

చిట్యాల: కౌలు రైతులను అధికారులు పట్టించుకోవడం లేదని సామాజిక సేవా సంస్థ చైర్మన్ సర్వ శరత్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇటీవల కురిసన రాళ్ల వానకు మండలంలోని కౌలు రైతులే ఎక్కువగా పంటు నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 10వేలు నష్ట పరిహారం అందిస్తామని ప్రకటించిన అధికారులు పైపై సర్వేలు చేసి వారికి అనుకూలంగా ఉన్న వారి పేర్లనే నమోదు చేసుకున్నారని ఆరోపించారు. కౌలు రైతులు, సన్నచిన్నకారు రైతులను అధికారులు పట్టించుకోవడం ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పంటలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు చెక్క శ్రీనివాస్, పర్లపేల్లి రాజయ్య, రాజుకుమార్, మట్టివాడ శ్రీనివాస్, ఇసంపెల్లి రాములు, నెరేళ్ల లింగయ్య ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కాటారం: పదో తరగతి పేపర్ లీకేజీకి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంట సర్వేశ్, కార్యదర్శి బోనాల సునీల్ చారి ఒక బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పరీక్షలు ప్రారంభమైన మొదటి రోజే పది నిమిషాలకే వాట్సప్‌లో పేపర్ ప్రత్యక్షమవడం పలు అనుమానాలకు తావిస్తుందని ఆరోపించారు. ఆ ఘటన మరవకముందే హిందీ పేపర్ కూడా లీకేజీ అవడం విద్యార్థిలోకాన్ని నిర్ఘాంతపోయేలా చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు ఇన్ని రోజులు కష్టపడి చదువుకొని పరీక్షలు రాస్తున్న సమయంలో ఇలా పేపర్ లీకేజీ వ్యవహారం చోటుచేసుకోవడం వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు పరీక్షలపై విశ్వాసం పోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని లేకుంటే యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.